


2 లో..

# ఎన్నారైలు ముందుకు రావాలి..

వ్యాపారాలను అభివృద్ధి చేయాలి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 317 గురువారం | 04 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# కాలువ కట్టరు.. ముంపు తప్పదు



వివరాలు 2లో..





## వరద కాలువ నిర్మాణంలో ఆలస్యం

## వర్షాకాలం ప్రారంభమైనా ఆగుతూ సా.. గుతున్న పనులు

## అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న జనం

## జూలై, ఆగస్ట్ మాసాల్లో భారీ వర్షాలు

## ఆందోళనలో తూర్పు ప్రజలు

అధికారుల అసమర్థత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు శాపంగా మారింది. గత నాలుగైదు సంవత్సరాలుగా తేలికపాటి వర్షానికే ఈ నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గత అనుభవాలనుంచి పాఠాలు నేర్వాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ఈ ప్రాంత వాసులకు వర్షాకాలం వచ్చిందంటే కంటిమీద కునుకు కరువవుతోంది. ముఖ్యమంత్రులు, మంత్రులు వచ్చి ముంపు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించినా అవి నీటి మీది రాతలుగానే మిగులుతున్నాయి. వరద కాలువ నిర్మాణంతో కొంతలో కొంతైనా ముంపు నుంచి రక్షణ లభిస్తుందని భావించినా ఆ పనులు ఆగుతూ సా..గుతున్నాయి. పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా వాటిని పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే ప్రాంతంలో మేయర్ ఉన్నప్పటికీ పనుల్లో పురోగతి మాత్రం కనిపించడం లేదు. జూన్ మాసంలో ఆశించిన వర్షాలు కురవక పోవడంతో ముంపు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే జూలై, ఆగస్ట్ మాసాల్లో భారీ వర్షాలున్నాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలతో ఇక్కడి ప్రజల గుండె గుభేలంటోంది. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

## పర్యాటక ప్రాంతంగా దేవునూరు గుట్టలు

హంటర్ రోడ్డులోని జూపార్క్‌ను అక్కడికే తరలించాలి

ధర్మసాగర్ బండ్ అభివృద్ధి చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష

## ఒక్క ఇటుక తీసినా.. గాంధీభవన్ కూలుతుంది

హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది




8లో..

# కాలువ కట్టరు.. ముంపు తప్పదు



**వరద కాలువ నిర్మాణంలో ఆలస్యం**

**వర్షాకాలం ప్రారంభమైనా ఆగుతూ సా.. గుతున్న పనులు**

**అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న జనం**

**జూలై, ఆగస్ట్ మాసాల్లో భారీ వర్షాలు**

**ఆందోళనలో తూర్పు ప్రజలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలను వరద ముంపు భయపెడుతోంది. స్మార్ట్ సీటీలో భాగంగా భద్రకాళి బండ్ నిర్మాణం జరిగినప్పటినుంచి ఈ ప్రాంత ప్రజలు ముంపుకు గురవుతున్నారు. గతంలో నగరంలో కురిసిన వర్షం నీరు వివిధ మార్గాలగుండా భద్రకాళి చెరువులోకి చేరేది. చెరువు నిండి అలుగు పోయడంతో నీరు నేరుగా ఊరు అవతల ఉన్న ఇతర చెరువుల్లోకి ప్రవహించేంది. బండ్ నిర్మాణంతో వర్షపు నీరు ప్రవహించే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో రఘునాథ్ కాలనీ, రామన్నపేట, ఓఎస్ నగర్, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఎస్ ఆర్ ఆర్ తోట, శాంతి నగర్, శివనరగ్, పాపయ్యపేట, ఏనుమాముల, ఎస్ఆర్ నగర్, సాయి గణేశ్ కాలనీ, లక్ష్మీ గరణపతి కాలనీ, మధురా నగర్, వివేకానంద కాలనీలతోపాటు పలు ప్రాంతాలను వరద ముంపు భయపెడుతోంది.

## సా.. గుతున్న వరద కాలువ నిర్మాణం..

వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ బల్దియా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు వరద కాలువ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వరంగల్ పోతన నగర్ రోడ్డులో చేపట్టిన పనులు ఆగుతూ సా..గుతున్నాయి. దీంతో సమీపంలో ఉన్న రఘునాథ్ కాలనీ, రామన్నపేట, ఓఎస్ నగర్, సంతోషిమాత కాలనీ, పాపయ్యపేట తదితర కాలనీలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. వరంగల్ చౌరస్తా, శివనగర్, హంటర్ రోడ్ 12 మోరీల నుంచి పోతనరోడ్ నాలాకు మురుగు, వరదనీరు పోటెత్తనుంది. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా నగరంలో వచ్చిన వరదలతో నాలుగైదు రోజులపాటు పలు కాలనీ వాసులు ముంపులోనే కాలం గడపాల్సి వచ్చింది. ఈ విషయం తెలిసి కూడా బల్దియా ఇంజినీర్లు అశ్రద్ధ వహిస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావిడి చేయడం తర్వాత మిన్నకుండడం పరిపాటిగా మారింది.

## తూ.. తూ మంత్రంగా..

ప్రతి ఏడు వేసవి కాలంలోనే గ్రేటర్ అధికారులు మాన్ సూన్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంటుంది. దాని ప్రకారం లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా చర్యలు చేపట్టడంతోపాటు కాలనీల్లో అవసరమైన ప్రాంతాల్లో కాల్వలు, కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుంది. కాని మాన్ సూన్ యాక్షన్ ప్లాన్ అర్థాన్నే బల్దియా అధికారులు, పాలకులు మార్చివేశారు. కేవలం కల్వర్టుల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించడానికే దీనిని పరిమితం చేశారు. ప్రధాన కాలువల్లో తూ..తూ మంత్రంగా సిల్ట్ తొలగించిన అధికారులు డివిజన్ల పరిధిలోని మురుగు కాలువల జోలికే వెళ్లలేదు. ఆ తొలగించిన సిల్ట్ సైతం కాలువ పక్కనే గుట్టలుగా వేయడంతో వర్షం పడగానే ఆ సిల్ట్ తిరిగి కాలువలోకే జారిపోతోంది. దీంతో యథా అధికారులు..తథా సిల్ట్ అన్నట్లుగా మారిపోతోంది.





వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

## జూలై, ఆగస్ట్ మాసాల్లో భారీ వర్షాలు..

నగరంలోని 29వ డివిజన్ పోతన రోడ్ లో వరద కాలువ నిర్మాణ పనులు అరకొరగా సాగుతున్నాయి. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ వాటిని పెద్దగా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదే ప్రాంతంలో ఉన్న పాత నాలాను పూర్తిగా మూసేశారు. జూలై, ఆగస్ట్ మాసాల్లో భారీ వర్షాలు పడితే వరద నీరు ఎటు వెళ్తుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. వరద కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడంతో గతంలో కంటే ఈ ఏడు వరద ముంపుతో అధిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందంటూ స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వరదలనుంచి బల్దియా అధికారులు గుణపాఠం నేర్చుకోవడం లేదని అదే నగర ప్రజలకు నరకంగా మారుతోందంటున్నారు. ఇప్పటికైనా మేయర్ గుండు సుధారాణి, బల్దియా ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన కాలువ నిర్మాం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎన్నారైలు ముందుకు రావాలి..

**వ్యాపారాలను అభివృద్ధి చేయాలి**

**ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు ముందుకు వచ్చి ఇక్కడి నగరాల్లో మీ వ్యాపార సంస్థలను ఏర్పాటు చేయాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండలో రంజిత్ రావుల ఏర్పాటు చేసిన రాక్స్ ఐటీ సొల్యూషన్ ను మంత్రి గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రంజిత్ రావుల అమెరికాలో స్థిరపడినప్పటికీ తన సొంత జిల్లా, ప్రాంతం అభివృద్ధి చెందాలన్న తలంపుతో రాక్స్ ఐటీ సొల్యూషన్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ హైదరాబాద్ లోనే వ్యాపారం చేస్తూ అక్కడే స్థిరపడాలనే ఉద్దేశంతో కాకుండా వరంగల్ నగరంలో కూడా ఐటీ వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. చదువులకు కేంద్రంగా, విజ్ఞానానికి నిలయంగా అనేక కళాశాలకు పుట్టినిల్లుగా నిలిచిన వరంగల్ లో ఉన్న మానవ వనరులను ఉపయోగించుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. అమెరికా, ఇతర దేశాలను వెళ్లకుండా వారి ఇంటి వద్దనే సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు కల్పించాలన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా రంగాలతోపాటు సాఫ్ట్ వేర్ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆ లక్ష్యంలో భాగంగానే వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్ లాంటి నగరాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మన రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇక్కడ సంస్థలు ఏర్పాటు చేసే వారికి పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఇక్కడ పెండింగ్ లో ఉన్న విమానాశ్రయ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే సమస్యను పరిష్కరించి విమానాశ్రయం ఏర్పాటు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



హనుమకొండ, వరంగల్ సాఫ్ట్ వేర్ రంగానికి పరిమితం కాకుండా టెక్స్టైల్ పరిశ్రమకు సంబంధించిన వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలిపినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ తర్వాత వరంగల్ కు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఏ విధంగా హైదరాబాదును అభివృద్ధి చేసామో అంతకంటే మెరుగ్గా ఇక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వపరంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామని, అలాగే ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి కల్పన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాక్స్ ఐటీ సొల్యూషన్స్ స్థాపకులు రంజిత్ రావుల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో సబ్ స్టేషన్లు నిర్మించాలి

**ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ , విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్ని జిల్లాలకు చెందిన కంస్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్లు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. కొత్తగా సబ్ స్టేషన్ లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. అలాగే పాత సబ్ స్టేషన్ లు పునరుద్ధరణ జరగాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్ కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేట్లు 1,600 కిలో మీటర్ల మేర కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాతో ఒక సబ్ స్టేషన్ నుంచి సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు వెంటనే మరొక సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందించే వీలుంటుందన్నారు. తద్వారా అంతరాయాలు లేకుండా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించగలమన్నారు. డిసెంబర్ లోగా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా లైన్లు అన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు, డైరెక్టర్(ప్రాజెక్ట్స్) టి.సదర్ లాల్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, ఎస్ ఈ అంకుష్, జీఎం శేషారావు, డీఈ ఐటీ కె.అనిల్ కుమార్, డీఈ టి. శ్రీధర చారి, మహేందర్, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా బత్తిని సుదర్శన్ గౌడ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్ టియూసీ 3194 యూనియన్ (ప్రభుత్వ గుర్తింపు సంఘం) ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ గా బత్తిని సుదర్శన్ గౌడ్, కన్వీనర్ గా చాడ బుచ్చిరెడ్డిలను నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాం సుందర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డిలు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని క్యాడర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేసేందుకు నిరంతరం కృషి చేస్తూ ఉన్నామని, రాష్ట్ర కమిటీలో కూడా ఉపాధ్యక్షులుగా గత 15ఏళ్లుగా పనిచేస్తున్నందుకు గుర్తింపుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో యూనియన్ ని బలోపేతం చేయుటకు చైర్మన్, కన్వీనర్ పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తమను గుర్తించి పదవులు ఇచ్చిన రాష్ట్ర కమిటీ కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.

## సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో నూతన సీసీ రోడ్ల పనులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ శంకుస్థాపన చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఎన్డీఆర్ఎఫ్, జనరల్ ఫండ్ కింద రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్ల శంకుస్థాపన, అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని వ్యాఖ్యానించారు. సీసీ రోడ్ల పనుల్లో ఎలాంటి అవకతవకలు జరిగిన, అలాగే నాణ్యత లోపాలు ఉన్నా సరే వారి పైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, 36వ వార్డు కౌన్సిలర్ నీరజ రెడ్డి, అజయ్ సారథి, విజయ్ సారథి, వార్డు నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం మధున పోచమ్మ వద్దకు పోవడానికి రోడ్డు సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని భక్తులు కోరుకుంటున్నారు. అవసరం లేని దగ్గర లక్షల రూపాయలతో సీసీ రోడ్డు వేస్తున్నారు. కానీ, అమ్మవారి దగ్గరకు మొక్కులు చెల్లించడానికి వెళ్లడానికి దారి లేకపోవడంతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుకుంటున్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన ముత్యాల విజయ్



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని స్వగ్రామం కేసముద్రంలో మర్యాదపూర్వకంగా ముత్యాల విజయ్ కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో గండి సీతారామ గౌడ్, రావూరి ప్రశాంత్, కొండలరావు, నంద కుమారస్వామి, గజ్జల చందు ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు అందరూ దారిద్ర్య రేఖకు దిగువనున్న వారే ఉంటారని ఓపికతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామ పంచాయితీ పరిధిలోని సారంగపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఇచ్చారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను, పాఠశాల ఆవరణ పరిశీలిస్తూ సమర్థ నిర్వహణకు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పనతో పాటు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సర్వన్ కుమార్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఆర్ఐ విజయేందర్, తదితరులు పాల్గొన్నారు.





### కేంద్రీయ విశ్వ విద్యాలయం స్థల పరిశీలన..

ములుగు జిల్లా అభివృద్ధి పనులకు అవసరమైన భూమి పర్యిలించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. చగురువారం జిల్లా కలెక్టర్ ములుగు మండలం లోని జగన్నపేట గ్రామ పంచాయితీ పరిధిలోని సారంగపల్లి లో కేంద్రీయ విశ్వ విద్యాలయం కోసం 6 ఎకరాల స్థల పరిశీలన చేశారు. అనంతరం కలెక్టర్ చిన్న గుంటూరు పల్లి లో సమీకృత గురుకులాల విద్యా సంస్థల ఏర్పాటు కోసం అవసరమైన 20 ఎకరాల స్థల పరిశీలన చేశారు. ఇంచర్లలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఆర్ఐ విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో అభివృద్ధి చేశాం

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలో పరకాల, నడికూడ,ఆత్మకూర్, దామెర మండలాల పదవీకాలం ముగిసిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు హనుమకొండలోని వారి నివాసంలో చల్లా ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులను సన్మానించారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో పదవీ విరమణ సహజమేనని అన్నారు. పరకాల నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ అభివృద్ధి చెందాయని, అందులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ప్రధానమైనదన్నారు. ఉత్తమ సేవలతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. పదవి లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో గురువారం స్థానిక మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన సాధారణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని సమావేశాన్నిఉద్దేశించి మాట్లాడుతూ తొర్రూరు పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుపుతూ అభివృద్ధిలో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ పట్టణ అభివృద్ధి కోసం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ తో పలు అభివృద్ధి విషయాలపై కలెక్టర్‌సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలలో వీధి కుక్కల సమస్య ఒకటి వీధి కుక్కల నియంత్రణలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. వాటిని త్వరలోనే నియంత్రణ చేయడానికిచర్యలు తీసుకుంటామని పేర్కొంటూ పట్టణంలో ఉన్న డ్రైనేజీ, నీటి సమస్య ఇతరత్రా సమస్యలను తక్షణమే తీర్చడానికి తగుచర్యలు చేపడతానని అన్నారు.

# ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంగా కన్నాయిగూడెం

### అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీజ

**వరంగల్ వాయిస్, కన్నాయిగూడెం :** ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, నీతి ఆయోగ్ ప్రొఫెషనల్ అధికారిని గాయత్రితో కలిసి కన్నాయిగూడెం ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో కన్నాయిగూడెం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంగా ఎంపికైందని, దానిలో భాగంగా సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సూచించిన ఆరు సూచికలను ప్రామాణికంగా తీసుకొని పూర్తిగా మండలంలో అమలు చేయాలని, ఆస్పిరేషనల్ బ్లాకు ఇన్స్పిరేషనల్ బాక్సుగా మార్చడానికి అన్ని రంగాల్లో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడానికి నీతి ఆయోగ్ సూచించిన 6 సూచికలను మూడు నెలల ప్రణాళికలో 100 శాతం అమలుపరిచడానికి సంపూర్ణత అభియాన్ మంచి కార్యక్రమం అని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ అందించిన సూచికల్లో ముఖ్యంగా వైద్యరంగం, పౌష్టికాహారం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం ఈ నాలుగు రంగాల్లో కన్నాయిగూడెం మండలంలోని ప్రజలకు అందించడానికి నీతి ఆయోగ్ మూడునెలల సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. స్థానిక ఆశ్రమ బాలుర పాఠశాలలో ఈ సంపూర్ణ అభియాన్ గురించి వ్యాసరచన పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా తదితరులు పాల్గొన్నారు.



గురువారం 04, జులై 2024
www.warangalvoice.net

# పేపర్ లీకేజీ మాఫియాకు వత్తాసు పలుకుతున్న మోడీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో 10 సంవత్సరాల నుంచి వివిధ పోటీ పరీక్షల పేపర్లు 65 వరకు లీకేజీలు జరిగినప్పటికీ పేపర్ లీకేజీలను అరికట్టి దేశంలోని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్ యూఐ, పీడీఎస్ యూ, ఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలవత్ రాజేష్, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి బాశ బోయిన వేణు రాజ్ లు మాట్లాడుతూ దేశంలోని పేదవర్గాలను ఉన్నత వైద్య విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే నీట్, యూజీసీ నెట్ పేపర్ల లీకేజీలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీల వలన పేద విద్యార్థులు నష్టపోతున్న మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు



స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేశంలో పేపర్ లీకేజీ ఘటనలకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నీట్ మరియు యూజీసీ నెట్ పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిచే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, అవసరమైతే విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి దేశ పార్లమెంటును ముట్టడిస్తామని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, కసర బోయిన రవితేజ, మహేష్, గణేష్, ముషారఫ్, సృతిన్, ప్రణీత్, గణేష్, పవన్, పృథ్వీరాజ్, మానపాక చరణ్ ,వంశీ, శరత్, రంజిత్, బాలగోని రాకేష్, మెరుగు రాజేష్, మహేష్ ఓమ్, జి.సురేష్ నాయక్, శివ కుమార్, అర్జున్, జస్వంత్ వికాస్, రూపేష్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లక్కపేట ఎంపీటీసీకి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లకపేట పైడిపల్లి ఉమ్మడి గ్రామాల ఎంపీటీసీ బొజ్జం రజిత రమేష్ ను వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇకముందు కూడా మీ సేవలు గ్రామాలకు అవసరమని, మీ సేవలతో గ్రామాలు అభివృద్ధి చేయాలని, గ్రామాల ప్రజలతో మమేకమై ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామాల డెవలప్ మెంట్ ముందు చూపుగా పోతుందని, గ్రామాల సమస్య మీ ద్వారా మాకు చెప్పడంతో గ్రామాలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరిగిన విద్యాసంస్థల బంద్ లో భాగంగా ఏఐఎస్ బీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లా ఐటీఐ కళాశాలలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అసమర్థత విధానాల వల్ల నీటి పరీక్షలో జరిగిన ఆవు కథలపై జ్యూడిషల్ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాల కళాశాల ఐటీఐ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ నాయకులు సుమన్, శరత్, వర్షిత్ పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో రుద్ర హెూమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాస శివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ సాయిబాబా మందిరంలో రుద్ర హెూమం నిర్వహించారు. ఆలయ పూజారులు కిషోర్ శర్మ, చందు, మణిశర్మలు హెూమాన్ని నిర్వహించగా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్ భక్తులు పాల్గొన్నారు. మందిరానికి విచ్చేసిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సతీష్ బాబు, సత్యనారాయణ కుటుంబ సభ్యులు శ్రీ సాయినాథుని మధ్యాహ్న హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శనానంతరం వారికి బాబా శేష వస్త్రాలను ధర్మకర్తలు అందించారు .తదుపరివారు హెూమ పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పాఠశాలలకు బంద్ కారణంగా సెలవు దినం కారణంగా చిన్నారులతో సహా తల్లిదండ్రులూ విచ్చేయడంతో గురువారం మందిరం ఒక పండుగ వాతావరణం సంతరించుకుంది.

## పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ శాంతి కుమార్, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ తొర్రూరు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి సంకోచితం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి తన వంతు పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంచడానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ చూపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా కేంద్రం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లైంగిక దాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్ కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించే వరకూ భరోసా సెంటర్ అండగా నిలుస్తుందని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం నర్సంపేట బైపాస్ రోడ్డుకు ఉన్న భరోసా సెంటర్ ను అడిషనల్ ఎస్పీ సందర్శించారు. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీసులు న్యాయ సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలతో బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ‘భరోసా’ కేంద్రం పని చేస్తుందని అన్నారు. బాధితులు రాగానే ఎవరి పరిధిలో వారు పనిచేస్తూ సత్వర న్యాయానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. వీటితో పాటు ఈ భరోసా సెంటర్లు బాధితులకు నైపుణ్యాలను నేర్పించి, వారిని సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడుతుందన్నారు. అందుబాటులో ఉన్న లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్ మెంట్ రికార్డు సమావేశ గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్సై రమాదేవి, భరోసా టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## అసమర్థ ఎన్టీఏను రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ కోరారు. పాఠశాలల మూసివేత చర్యలు ఆపాలని, కేంద్ర ప్రభుత్వ నిర్వహించిన పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిస్తూ ఎస్ఎఫ్ఐ, వామపక్ష ప్రజాస్వామ్య విద్యార్థి యువజన సంఘాల పిలుపు మేరకు గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ పరకాల పట్టణంలో, మండలంలో విజయవంతంగా సాగింది. ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛంద బందును ప్రకటించడం ప్రభుత్వ పాఠశాలలను కళాశాలలను బైకాట్ చేసి బంద్ ను సాఫీగా నిర్వహించడం జరిగిందని మీడియాతో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మడికొండ ప్రశాంత్, పరకాల మండల, పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, జిల్లా కమిటీ సభ్యులు కోగిల ప్రేమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన సీఐని కలసిన కాంగ్రెస్ నాయకులు




**వరంగల్ వాయిస్, పరకాల :** నూతన సీఐగా బాధ్యతలు తీసుకున్న వడ్లూరి క్రాంతికుమార్ ను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, కార్యదర్శి డాక్టర్ మలహాల్ రావు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పర్నెం తిరుపతి రెడ్డి, నాయకులు పెండ్యాల విక్రమ్ రెడ్డి, పరకాల టౌన్ నాయకులు ఒకటో వార్డ్ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, పరకాల పట్టణ మాజీ అధ్యక్షుడు మడికొండ శ్రీనివాస్ ఉన్నారు.

# దొడ్డి కొమరయ్య చిరస్మరణీయుడు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూమి, భుక్తి, విముక్తి కోసం, ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రాణాలర్పించిన దొడ్డి కొమరయ్య చిరస్మరణీయుడని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో కొమరయ్య 78వవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగిస్తూ నిజాం రాక్షస పాలనకు భూస్వామ్య దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య తెలంగాణ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటాడన్నారు. 78 ఏళ్లయినా ఆయన ఆశించిన సమ సమాజం రాలేదని, సామాజిక న్యాయం మచ్చుకైనా లేదని, నయా భూస్వామ్య పెట్టుబడి దారి దోపిడీ వ్యవస్థ కొనసాగుతున్నదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని బీసీలు దళితులు బడుగు బలహీన వర్గాల వారు చైతన్యంతో సంఘటితంగా రాజ్యాధికారం సాధించడానికి పోరాడాలన్నారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు ఓర్సు రాజు ప్రధాన కార్యదర్శి వలబోజు వెంకన్న ఉపాధ్యక్షుడు పరికరాల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, ప్రజా సంఘాల నాయకులు ఎండీ కాశీం, దస్రు, సంద్ర కుమార్, మంద ఐలయ్య, మనోహర్, చంద్రశేఖర్,నూతి అంజలి, సరళ, గౌషియాబి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అగ్నికణిక దొడ్డి కొమురయ్య



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సాయుధ పోరాట అగ్నికణం దొడ్డి కొమురయ్య అని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య అన్నారు. తెలంగాణ రైతాంగం పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ లో జీఎంపీఎస్, కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయన 78వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో వెట్టిచాకిరికి, కాళ్లు మొక్కుతా, బాంచెన్ దొర బతుకులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. ఈ సాయుధ పోరాటంలో తొలి అమరుడు, నైజాం తూటాలకు నేలరాలిన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని తెలిపారు. తెలంగాణలో నిజాం విరంకుశ పాలన నుంచి విముక్తి పొందడానికి అలుపెరుగని పోరాటం చేసిన మహావీరుడు అని కొనియాడారు. జనగామ జిల్లా కడవెండి గ్రామంలో పుట్టిన దొడ్డి కొమురయ్య ఈ పోరాటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాలలో దొడ్డి కొమురయ్య పాఠ్యాంశాన్ని చేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అమడగాని రఘు యాదవ్, రాకేష్ యాదవ్, గాండ్ల యాదగిరి, మధుగిరి మల్లయ్య, మంగ ప్రభాకర్, వెంకట్ యాదవ్, ఎర్ర శ్రీను, ఎడ్ల శ్రీను, కుమారస్వామి, వెంకన్న, కళ్యాణ్, అనీల్, అన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడి రహిత సమాజం కోసం పోరాడాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భూమి, భుక్తి, వెట్టి చారికి విముక్తి కోసం దొరల, భూస్వాముల, జాగీర్దార్ల, నైజాం పాలకులపై సాగించిన తెలంగాణ రైతంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో నేటి సమాజంలో ఉన్న దోపిడీ అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో 78వ వర్ధంతిని పురస్కరించుకొని దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ. బాంచన్ దొర నీ కాళ్లు మొక్కుతా, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా సాగిన మహత్తర విప్లవ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని, ఈ పోరాటంలో దొడ్డి మల్లయ్య కొమురయ్యలు ఎర్ర జెండా చేతబట్టి ఆంధ్ర మహాసభ నాయకత్వంలో దొరల ఆగడాలతో విసిగి వేసారిన ప్రజలను ఐక్యం చేసి భూస్వాముల జాగీర్దార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించి ఆ పోరాటంలో విస్నూరి దేశ్ ముఖలకు, గుండాల నైజాం పాలపై పిడికిలెత్తి అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని ఆయన అన్నారు. ఆ పోరాటాన్ని ఆయన స్ఫూర్తిగా తీసుకొని నేటి సమాజంలో ఉన్న దోపిడీ అణిచివేత, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే దొడ్డి కొమురయ్యకు ఇచ్చే ఘనమైన నివాళులని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోత్ వీరన్న, నాయకులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, మల్లయ్య, మంద మల్లేశం, రమేష్, పాపయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయుధ పోరాటంలో పాల్గొని సర్వస్వం త్యాగం చేసిన కుటుంబాలకు పెన్షన్లు ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవమానించిందన్నారు. పోరాట యోధుల చరిత్రను, ఆనాటి యోధుల త్యాగాలను విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీలకు తెలంగాణ త్యాగాల చరిత్ర గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, స్వేచ్ఛా సమానత్వం కోసం నిజాం పాలనకు కమ్యూనిస్టులు ఘోరీ కట్టారని, కానీ నేడు ఆ పోరాటంలో పాల్గొనని బీజేపీ లాంటి పార్టీలు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్ర నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోరాట యోధుల చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలిసేలా వారి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడంతో పాటు హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, ఏశబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, రమేష్ దేవా, కొట్టె వెంకటేష్, అంబి సాంబయ్య, బొట్టు భిక్షపతి, నిమ్మల మనోహర్, రత్నం తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య

## అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఉద్యమ కారుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి అన్నారు. గురువారం దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి పురస్కరించుకొని సంక్షేమ భవన్ లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో "శ్రీ దొడ్డి కొమరయ్య "వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమవడానికి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి ఉద్యమంగా పోరాటం మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణం, తెలంగాణ సాయుధ పోరాటానికి మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సీహెచ్.రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ రాజ్ కుమార్, దొడ్డి కొమరయ్య వారసుడు మేకల మహేందర్ (కేవైసీఎస్ ప్రెసిడెంట్), ముంజాల భిక్షపతి, సంక్షేమ భవన కార్యాలయ సిబ్బంది, బీసీ వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు సరిత, మానస, రేణుక, కుమారస్వామి, ఈ.ప్రతాప్, జి.గోపాల్ చారి, రత్నాకర్, నాలుగవ తరగతుల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొలి అమరుడు దొడ్డి కొమురయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** దొడ్డి కొమురయ్య గారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు, జనగామ ఉద్యమాల గడ్డ దేవరుప్పుల బిడ్డ, కడివెండి గడ్డపై నడయాడిన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో వారికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం సర్కార్ అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాల మీద యుద్ధం ప్రకటించి ఆనాడే ఉద్యమ బీజాలు నాటిన యోధుడు, ఉద్యమకారుడు దొడ్డి కొమురయ్య అని తెలిపారు. వారి స్ఫూర్తితోనే తొలి దశ, మలిదశ ఉద్యమానికి బాటలు పడ్డాయని తద్వారా వారి ఉద్యమ స్ఫూర్తితోనే 60 సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర సాధన తో రాష్ట్ర సాధన చేసుకున్నామని పేర్కొన్నారు. సాధించుకున్న రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు, ప్రజాస్వామ్య అభివృద్ధి దూరమైన సందర్భంలో తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో భవిష్యత్ తరాలు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలు కూడా స్ఫూర్తిగా వారి ఆశయసాధన కోసం పని చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, యూత్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని నేటి యువత ఆచరించాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా డివిజన్ లోని దొడ్డి కొమురయ్య నగర్ లో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుండే రాజు ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి వేడుకలలో మరుపల్ల రవి ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూల దండలేసి నివాళులర్పించారు. రజాకర్లు, దేశముఖ్ గుండాల చర్యలను ఎదురెడ్డి భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన ధైర్యశాలి దొడ్డి కొమురయ్య అని ఆయన కొనియాడారు. దొడ్డి కొమురయ్య పోరాట యోధుడిని దొంగ చాటుగా దేశ్ ముఖ్ గుండాలు చంపారని అయన అన్నారు. దొడ్డి కొమురయ్య మరణాంతరం ప్రజలందరూ ఎదురు తిరగడం వల్లే రజాకార్ దేశముఖు లు పారిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్, నాయకులు కోరే కృష్ణ, కుండే రాజు, వంగరి సర్వేశ్వర్, తవుటం నర్సింహా, కుండె కుమార్ స్వామి, దాసరి రాజు, అల్లే సమ్మయ్య, ఠాకూర్ సత్యం, ఎండీ అమీర్, ప్రశాంత్, వరుణ్, చీర కవిత, మంద రమా, పొలం విజయ, శంకపల్లి మహేశ్వరీ పాల్గొన్నారు

# స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలకు విశేష స్పందన

## ముగిసిన ఎంపిక పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ ఎంపికలు గురువారం ముగిసాయి. గత యేడాది కన్నా అధికంగా ఈసారి జరిగిన ఎంపికలకు హాజరు కావడం విశేషం. మహబూబ్ నగర్, కొత్తగూడెం, నాగర్ కర్నూల్ సుదూర ప్రాంతాల నుంచి క్రీడాకారులు విచ్చేయడం విశేషం. గురువారం ఈ ఎంపికలను జిల్లా క్రీడలు యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ ప్రారంభించారు. అనంతరం వివిధ క్రీడాంశాలలో ప్రవేశాలకు విచ్చేసిన ఆటగాళ్లకు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జిమ్, మెడిసన్ బాల్ త్రో, 800 మీటర్ల పరుగు పందెం బ్యాటరీ టెస్టులను నిర్వహించారు. ఆయా క్రీడాంశాలకు సంబంధించి నైపుణ్యాలను పరీక్షించారు. గురువారం రెజ్లింగ్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్ , స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ లో జరిగిన ఎంపిక పోటీల్లో దాదాపు వంద మంది హాజరయ్యారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సెలక్షన్స్ లో అత్యధికంగా రెజ్లింగ్ లో, అత్యల్పంగా స్విమ్మింగ్ లో క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నుంచి విచ్చేసిన కోచ్ ల బృందం ఆధ్వర్యంలో క్రీడాకారులు ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా పాయింట్లు కేటాయించారు. ఈ ఎంపిక పోటీలో విశేష ప్రతిభ కనబరిచిన ఆటగాళ్ల జాబితాను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి సమర్పించనున్నట్లు జిల్లా క్రీడలు యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ తెలిపారు.

## నూతన చట్టాలపై ప్రచురించిన పుస్తకాల పంపిణీ

### అధికారులకు అందజేసిన ఎస్పీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మూడు కొత్త క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి పంపబడిన 30 పుస్తకాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ అధికారులకు అందజేశారు. ఎస్పీ ఆఫీస్ నుంచి ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి వద్ద ఈ పుస్తకం ఉంటుందని అన్నారు. కొత్త చట్టాల గురించి పౌరులకు మార్గనిర్దేశం చేసేందుకు జిల్లా పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పై ఈ సమగ్ర బుక్‌లెట్ ఉంటుందన్నారు. కొత్త విధానపరమైన చట్టం కింద చాలా ముఖ్యమైన విషయాలను కవర్ చేస్తుందన్నారు. దర్యాప్తు అధికారులు ఒకే రకమైన విధానాలను పాటించేందుకు స్పష్టత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్ఐలు భాస్కర్, సాంబాశివారావు, సోములు, అనిల్, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త చట్టాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని పలుగ్రామాల్లో గురువారం ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు రహదారుల వెంట ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జక్కుల సతీష్ రహదారి వెంట వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహన పత్రాలను పరిశీలించారు. ఎలాంటి వాహన పత్రాలు లేని వారికి ఎస్ఐ సతీష్ జరిమానా విధించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. అదే విధంగా ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు పలు గ్రామాల్లో కొత్త చట్టాలపై ప్రజలకి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఎంపీటీసీకి సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఈరోజు కాళేశ్వరంలో ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజును వారి నివాసంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెంగాని అశోక్, గ్రామ శాఖ అధ్యక్షుడు మంగాయి లక్ష్మణ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. 5 సంవత్సరాలుగా కాళేశ్వరం గ్రామ ప్రజలకు సేవలందించినందుకు చాలా గర్వంగా ఉందని ఎంపీటీసీ మమతా అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందెసిరి మధుసూదన్, మాజీ ఉప సర్పంచ్ సుల్తాన్, మజీద్ సదర్ సయ్యద్ సమద్, మాజీ వార్డు సభ్యులు బందేల సురేష్, సయ్యద్ ఇమ్రాన్, కావేరి రామకృష్ణ పాల్గొన్నారు.

## దాశరథి శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనందించిన కవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని గురువారం ఎమ్మెల్సీ, కవి, రచయిత, గాయకుడు దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దాశరథి శత జయంతి ఉత్సవాల ప్రారంభోత్సవ సభను ఈనెల 22న మహబూబాబాద్ లో ఘనంగా నిర్వహించేందుకు జిల్లాకు చెందిన సాహిత్య రచయితల సంఘంతో చర్చించి నిర్ణయించడం జరిగిందని, ఈ ఉత్సవాల్లో రాజకీయ, కవులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మంగళంపెల్లి కన్నా, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల కురవి మండలంలోని బంగ్య తండాలో డీపీఈఓ బి.కిరణ్ ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ దాడుల్లో అయిదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి (17) లీటర్ల సారాయి, (50) కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని (500) లీటర్ల పులియపెట్టిన బెల్లం పానకం అక్కడే ధ్వంసం చేశారు. మహబూబాబాద్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి, మహబూబాబాద్ డీటీఎఫ్ ఇన్ స్పెక్టర్ సీహెచ్.నీరజ, కురవి సీఐ గోపి, మహబూబాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కిరీటి, డీటీఎఫ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ బీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న విద్యాసంస్థలు సంపూర్ణంగా బందు నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ బీ నాయకులు విద్యార్థులు భారతి డిగ్రీ కళాశాల నుంచి పోచమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోచమ్మ జంక్షన్ లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. తక్షణమే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, ప్రవీణ్ మోహన్, ఫర్కాన్ తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

### సీతక్కను కలిసిన విద్యార్థి నేతలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హనుమకొండ జిల్లా బాలసముద్రంలో తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.75 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కళాక్షేత్రం ప్రాంగణంలో తెలంగాణ కళాకారులు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉస్మానియా, కాకతీయ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం తెలంగాణ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్ మెంట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల మంత్రి దాసరి అనసూయ సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 6న గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులు, తమ పాటలతో ప్రజలందరినీ చైతన్యవంతం చేసిన వ్యక్తి గద్దర్ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఇప్పటికే కళాకారులకు నంది అవార్డుల బదులు గద్దర్ అవార్డులు ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అందుకే హనుమకొండలో నిర్మిస్తున్న కళల క్షేత్రం ముందు గద్దర్ విగ్రహం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆ కళాక్షేత్రానికి గద్దర్ పేరు నామకరణం చేయడం గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, ఓయూ స్కాలర్స్ దూడపాక సురేష్, నవీన్ యాదవ్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాడపాక రాజేందర్, తెలంగాణ యువజన సమాఖ్య రాష్ట్ర జనరల్ సెక్రటరీ దుప్పటి ప్రవీణ్, టీజీవీపీ నాయకులు రంజిత్, డీబీఎస్ఏ ఓయూ అధ్యక్షులు సమీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి




**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీ హెచ్ డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. పాఠశాలల మూసివేత చర్యలు ఆపాలని , కేంద్ర ప్రభుత్వ నిర్వహించిన పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిస్తూ ఎస్ఎఫ్ఐ , వామపక్ష ప్రజాస్వామ్య విద్యార్థి యువజన సంఘాల పిలుపు మేరకు గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల ఎల్కతుర్తి మండలంలో విజయవంతంగా కొనసాగింది. ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛంద బంద్ ను ప్రకటించడం ప్రభుత్వ పాఠశాలలను కళాశాలలను బైకాట్ చేసి బంద్‌ను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు గణేష్, సన్నీ, అజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక మల్లికాంబ మనోవికాస కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నేత బిల్లా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఏటా దయాకర్ రావు పుట్టినరోజు సందర్భంగా డెఫ్ అడ్ డంబ్ పిల్లలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి చెప్పారు. 6 సార్లు ఎమ్మెల్యేగా, ఒకదఫా ఎంపీగా, మంత్రిగా ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పోగులకొండ వేణు, నేతలు ఉబ్బని సింహాద్రి, బిల్ల ఉషశ్రీ, కుంట మధు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 04, జులై 2024
7



## జీబ్రా సినిమాలో సత్య డిఫరెంట్ రోల్

టాలీవుడ్ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన మోషన్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. ఇదిలావుంటే సత్యదేవ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి బర్త్ డే విషెస్ తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీలో సత్య సూర్య అనే పాత్రలో కనిపించబోతున్నాడు.యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జోడీగా ప్రియా భవానీ శంకర్, నటిస్తుంది. పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. కాగా ఈ చిత్రాన్ని ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.






## వెంకీ సినిమాకు
### క్లాప్ కొట్టిన అల్లు అరవింద్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి వారి కాంబినేషన్లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం. 58 కోసం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. రెండు హిలేరియస్ హిట్‌ల– ఈ2, ఈ3 తర్వాత వారు ఒక ఇంట్రస్టింగ్ ప్రాజెక్ట్ కోసం మరోసారి చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచాన్ చేయగా, గీతా ఆర్ట్స్ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ఈ న్యూ మూవీ హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్స్ లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్ ట్రార్డినరీ ట్రైయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లను అందించిన నేపథ్యంలో, వారి కాంబినేషన్‌లో మరో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రేక్షకులు మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు.

## శరవేగంగా విశ్వంభర
### మ్యూజిక్ సిట్టింగిలో కూర్చున్న చిరు

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఒకప్పుడు మ్యూజిక్ సిట్టింగ్స్ ను చిత్ర యూనిట్ సభ్యులు అంతా కలిసి కూర్చుని నిర్వహించే వారు. కానీ ఇప్పుడు మాత్రం విదేశాల్లో, ఎక్కడో హాలీడే స్పాట్స్ లో దర్శకుడు మరియు సంగీత దర్శకులు మాత్రమే పాల్గొంటున్నారు. ఆ పద్ధతికి స్వస్థి చెప్పి మెగాస్టార్ ఇలా ఎలాన్ చేశారు. దర్శకుడు, సంగీత దర్శకుడితో పాటు హీరో చిరంజీవి మరియు ఇతర సాంకేతిక వర్గం కూడా ఈ మ్యూజిక్ సిట్టింగ్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి పాత సినిమాలకు చెందిన కొన్ని పాటలను కీరవాణి తన టీం తో పాడటంతో పాటు సంగీత కచేరి నిర్వహించారు. సంగీత దర్శకుడు కీరవాణి సంగీత కచేరికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆ రోజులను గుర్తు చేస్తూ చిరంజీవి ఈ వీడియోను షేర్ చేయడంతో పాటు కీరవాణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశాడు. .మరోవైపు సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' సినిమా పనులు శరవేగంగా జరుగు తున్నాయి. సినిమా డబ్బింగ్ వర్క్ మొదలైనట్లు నిర్మాణసంస్థ ఓ అప్‌డేట్ షేర్ చేసింది. దీనికి సంబంధించిన పనులు ఈరోజు ప్రారంభమయ్యాయని పేర్కొంది. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలిపింది. ప్రేక్షకులంతా జనవరి 10న అద్భుతమైన అనుభూతిని పొందడానికి సిద్ధంగా ఉండాలని కోరింది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై దాదాపు రూ. 200 కోట్ల భారీ బ్జడెట్‌తో 'విశ్వంభర' తీర్చిదిద్దుతున్నట్లు టాక్. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాగా ఇది నిలిచిపోనుంది. అంతేకాదు, సోషియో ఫాంటసీ మూవీ కావడంతో వీఎఫ్ఎక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్స్ ఉండనున్నట్లు ఎప్పటినుంచో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ హీరోయిన్ త్రిష , ఆషికా అధికారికంగా జాయిన్ అయ్యారు. సురభి, ఇషా చావ్లా, మీనాక్షి చౌదరి పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. సంగీత దర్శకుడు కీరవాణికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్‌కు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. 'గతంలో పాటలు కంపోజ్ చేయాలంటే డైరెక్టర్ ఆధ్వర్యంలో మూవీ టీమ్ అంతా కూర్చొని పాటల గురించి చర్చించేది. ఈ చిత్రంలో చిరంజీవి హనుమంతుడి భక్తుడిగా కనిపించనున్నాడు. యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా అదిరిపోయేలా ఉండబోతున్నాయి. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ నటించబోతున్నాడు.








## నివేదా..
### 35 చిన్నకథ కాదు

నిన్నుకోరి, జై లవకుశ, వకీల్ సాబ్, శాకినీ డాకినీ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన నివేదా థామస్ ఈ మధ్య కాలంలో కాస్త సినిమాలను తగ్గించింది. తాజాగా '35 చిన్న కథ కాదు' సినిమాలో నటించింది. ఆ సినిమాకి సంబంధించిన పోస్టర్ ను విడుదల చేసిన సమయంలో సోషల్ మీడియాలో రకరకాలుగా పుకార్లు షికార్లు చేశాయి. సినిమాలో నివేదా భార్యగా, తల్లిగా కనిపించబోతుంది. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియా ద్వారా చిత్ర యూనిట్ సభ్యులు షేర్ చేయడంతో చాలా మంది కూడా నివేదా పెళ్లి అయ్యిందని, ఇతడే భర్త అన్నట్లుగా ప్రచారం చేశారట. ఆ విషయాన్ని నివేధా తాజా కార్యక్రమంలో చెప్పుకొచ్చింది. ంబెనీ ఖీ।జీట – అంబానీల సంగీత్‌ని ఊపేయడానికి దిగాడు! ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ లో నివేదా మాట్లాడుతూ... ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక ఫోటోను చూసి చాలా మంది నాకు పెళ్లి అయ్యిందని ప్రచారం చేశారు. ఆ విషయాలను మా అమ్మ నా వద్దకు తీసుకు వచ్చింది. అమ్మ ఆ ఫోటోలను నాకు పంపించింది. నాకు మీరు ఎప్పుడు సంబంధం చూశారు అన్నాను. ఈ సినిమాలో విశ్వదేవ్ కి భార్యగా నివేదా థామస్ నటించింది. అతడిని చూపిస్తూ నాకు పెళ్లి అయ్యింది, ఇతడే నా భర్త, వీళ్లు ఇద్దరు నా పిల్లలు అంటూ సరదాగా వ్యాఖ్యలు చేసింది. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ సినిమాను రానా సమర్పిస్తున్నాడు. నంద కిషోర్ ఇమాని దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా లో నివేదా నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు.



# పర్యాటక ప్రాంతంగా దేవునూరు గుట్టలు

**హంటర్ రోడ్డులోని జూపార్క్‌ను అక్కడికే తరలించాలి**

**ధర్మసాగర్ బండ్ అభివృద్ధి చేయాలి**

**ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, కార్యాచరణపై జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లోని సెక్రెటరియేట్ లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, బస్వరాజు సారయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దొంతి మాధవ రెడ్డి, రేవురి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంఏయూడీ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానా కిషోర్, సీడీఎంఏ విపి గౌతమ్, ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రెటరీ హరిచందన, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, పి.ప్రావీణ్య, జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ఆర్ అలైన్మెంట్, వరంగల్ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కూడా మాస్టర్ ప్లాన్, కాళోజీ కళాక్షేత్రం, జీడబ్ల్యుఎంసీ పరిధిలో ప్రధాన నాళాల రిటైనింగ్ వాల్ ల నిర్మాణం, వరద నివారణ చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం, కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులపై చర్చించారు.

**ఇనుపరాతి గుట్టలపై ప్రత్యేక చర్చ..**

ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని దేవునూరు (ఇనుపరాతి) గుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇక్కడ రోప్ వే, ట్రేకింగ్, క్యాంపింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. అదే విధంగా హనుమకొండ హంటర్ రోడ్డులోని జూ పార్క్ ను సైతం దేవునూరు గుట్టల్లో ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు ధర్మసాగర్ బండ్ ను సుందరీకరణ చేయాలని సూచించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతం హైదరాబాద్ వరంగల్ హైవే కు దగ్గరలో ఉండడంతో ధర్మసాగర్ బండ్, దేవునూరు (ఇనుపరాతి) గుట్టలు మంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయని వెల్లడించారు. దీంతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దేవునూరు (ఇనుపరాతి) గుట్టలు, ధర్మసాగర్ బండ్ అభివృద్ధికి వేంటేనే డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేయాలని, కన్సల్టెన్సీ టెండర్లు పిలవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, కుడాతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాలకు లయన్స్ సేవలు

**శాసనమండలి ఉపాధ్యక్షుడు బండా ప్రకాశ్**

**ఘనంగా థౌజండ్ పిల్లర్స్ ఇన్స్టాలేషన్ వేడుకలు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని శాసన మండలి చైర్మన్ వైస్ బండా ప్రకాశ్ సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలు తాము పొందిన లాభాల్లో సీఎస్ఆర్ కింద అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తాయని ఆ కార్యక్రమాలలో ప్రభుత్వాలు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ లాంటి సంస్థల సహకారం తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం రాత్రి శాయంపేట లయన్స్ భవన్ సమావేశ మందిరంలో లయన్ చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన లయన్స్ క్లబ్ అఫ్ థౌజండ్ ఫిల్లర్స్ 27వ కార్యవర్గ పదవీ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తనకు చిన్న నాటి నుంచి సామజిక కార్యక్రమాలపై ఆసక్తి వుండేదన్నారు. స్వచ్ఛందంగా సామాజికసేవ చేసిన వారికి సంఘలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ థౌజండ్ పిల్లర్స ప్రస్తుతం అధ్యక్షుడితో సహా అనేక మందితో వ్యక్తిగత పరిచాయల పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సభాధ్యక్షుడు చొప్పరి సోమయ్య జిల్లా గవర్నర్ సూచనల మేరకు అత్యుత్తమ సంస్థగా పేరు సంపాదించే దిశగా కృషి చేస్తామని ప్రకటించారు. కార్యదర్శిగా వెంకన్న, కోశాధికారిగా రవి తో పాటు వివిధ విభాగాలకు నియామకమైన లయన్ సభ్యులు పదవీ ప్రమాణం చేశారు. జిల్లా గవర్నర్ లయన్ వెంకట రెడ్డి, ఉప గవర్నర్లు చంద్రశేఖర్ ఆర్యా, నరహరి సుధాకర్ రెడ్డి, పూర్వ గవర్నర్లు డా.సుధాకర్ రెడ్డి, డా.రాజేందర్ రెడ్డి, కన్నా పరుశరాములు, పొట్లపల్లి శ్రీనివాస్, ముచ్చా రాజిరెడ్డి, వెంకటేశ్వర రావు, పోలీస్ అధికారి శివరామయ్య, డా.శ్రీకాంత్, సీనియర్ లయన్స్ పీవీ.మదన్ మోహన్, నరేందర్, చంద్రశేఖర్, అంజిరెడ్డి, పాము సీను రణధీర్ రెడ్డి, నవీన్, దయాకర్ రావు, గుజ్జారి రమేశ్, వామన్ రావు సమక్షంలో జిల్లా ఉపగవర్నర్ 2 పదవికి ఎంపికైన థౌజండ్ పిల్లర్స్ కు చెందిన నరహరి సుధాకర్ దంపతులను, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర కార్య వర్గానికి ఎంపికైన పెండెం వేణుమాధవ్, జాతీయ స్థాయి సంస్థలలో భాగస్వామ్యం అయిన థౌజండ్ ఫిల్లర్స్ అద్యక్షుడు చొప్పరి సోమయ్య, కార్యదర్శి పోస్టల్ వెంకన్న, కోశాధికారి రవి కుమార్ ఘన సత్కారం పొందారు. ఈ కార్యక్రమాన్ని వేణుమాధవ్, నరేందర్ సమన్వయపరిచారు.

# ఒక్క ఇటుక తీసినా.. గాంధీభవన్ కూలుతుంది

**హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనా అని చెప్పి, ప్రతీకారం తీర్చుకుంటుందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లాకార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకతను కూడగట్టుకుందన్నారు. హామీలు నెరవేర్చకుంటే నిలదీస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై కేసులు పెడుతున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ శాంతి భద్రతలను కాపాడలేని నిస్సాయస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అనేక ఉద్యమాలు చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని, పదేళ్లలో బ్రహ్మాండంగా రైతాంగానికి సకాలంలో ఎరువులు, రైతుబంధు, రైతు బీమాను అందించామని రుణమాఫీ కూడా చేశామని ఈ సందర్భంగా తెలిపారు. వారు ఇచ్చినటువంటి హామీల్లో రుణమాఫీ హామీని అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు తర్జనభజన పడుతున్నారని అన్నారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు కూడా ఇవ్వలేదని, సీఎంఆర్ఎఫ్ ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కాలయాపన చేస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక నెల మేడిగడ్డ కృంగిపోయిందని,మరొక నెల విద్యుత్ అవినీతి అని, మరొక నెల టెలిఫోన్ టాపింగ్ అని తాత్సరం చేస్తున్నారని మండిపడ్డారు. మా పార్టీ, కార్యాలయం జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలే అడ్డుకుంటారన్నారు. పార్టీ కార్యాలయాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయాన్ని కూల్చే కుట్ర చేస్తున్నారని, హనుమకొండ కార్యాలయం జోలికి వచ్చి టార్గెట్ కావొద్దని సూచించారు. గాంధీభవన్ కానీ, సీపీఐ, సీపీఎం, టీడీపీ ఇతర పార్టీల కార్యాలయాలకు భూమిని కేసీఆర్ రాకముందే కేటాయించారన్నారు. ఖాదీ బోర్డు కు కేటాయించినటువంటి భూమి కూడా ప్రభుత్వ భూమి అని అన్నారు. పార్టీ కార్యాలయంలో ఇటుక పెళ్ల కదిపినా గాంధీభవన్ కూలుతుందని హెచ్చరించారు. మా పార్టీ కార్యలయాలను టచ్ చేస్తే, మీ పార్టీ కార్యాలయాలను కూడా టచ్ చేయాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందినటువంటి జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఆంధ్ర బ్యాంకుకు ఏ విధంగా మీరు కిరాయికి ఇస్తారో తెలపాలని, కరీంనగర్ కాంగ్రెస్ జిల్లా ఆఫీసును పెళ్లిళ్లకు కిరాయికి ఇస్తున్నారని, ఖమ్మంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కమర్షియల్ గా వాడుకుంటున్నారని గుర్తు చేశారు. అనంతరం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, బోయిన్ పల్లి రంజిత్ రావు, నల్ల స్వరూపారాణి, ఇమ్మడి లోహిత రాజు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జానకి రాములు, నార్ల గిరి రమేష్, నయీముద్దీన్, ఉడుతల సారంగ పాణి, కుసుమ లక్ష్మీనారాయణ, బండి రజిని కుమార్, పరశురామ్, యాదగిరి, పోలేపల్లి రామ్మూర్తి, సాల్వాజీ రవీందర్, విద్యార్థి నాయకులు శరత్చంద్ర, బైరపాక ప్రశాంత్, సుమన్, వీరస్వామి, నాగరాజు, లంక రాజ్ గోపాల్, సౌరం రఘు, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలతోనే గుర్తింపు

**వరంగల్ జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి**

**ఘనంగా జిల్లా పరిషత్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తే రాజకీయ అవకాశాలు వాటంతట అవే లభిస్తాయని వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి అభిప్రాయపడ్డారు. గురువారం హనుమకొండలోని వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిషత్ ఐదు సంవత్సరాల (2019–24) పాలన కాలం సంతృప్తిగా సాగటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తాను 18 సంవత్సరాల క్రితం కార్పొరేటర్ గా గెలిచి మేయర్ అభ్యర్థిగా నిలిచిన్నప్పటికీ అవకాశం దక్కలేదని అప్పుడు కార్పొరేటర్ గా ప్రజలకు సేవలు అందించడం జరిగిందని సభ్యులందరి సహకారంతో తాను జడ్పీ చైర్మన్‌గా ఎంపిక కావడం జరిగిందన్నారు. హనుమకొండ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న జిల్లాకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలను జడ్పీ చైర్మన్ శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, ఫ్లోర్ లీడర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలకు అధికారులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఫ్లోర్ లీటర్ పెద్ది స్వప్న, వ్యవసాయ శాఖ ఏడి ఉషా దయాల్, డీఈఓ వాసంతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com